క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్‌): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయమని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవా రం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద తైక్వాండో మాస్టర్‌ అబ్దుల్‌మజీద్‌ ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు నీరజ బంగారు పతకం, సానియా, సింధు, పల్లవి సబ్‌ జూనియర్‌ పోటీల్లో రజత పతకం, లక్కీ సబ్‌జూనియర్‌ కాంస్య పతకాలు సాధించి నంద్యాలకు కీర్తిప్రతిష్టలు తెచ్చారని చెప్పారు. నంద్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్‌ అధ్యక్షుడు మారుతికుమార్‌, సెవెన్‌ హిల్స్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్రీడాకారుల కు పరికరాలు అందజేసినట్లు మాస్టర్‌ తెలిపారు.

28 నుంచి త్రోబాల్ జిల్లా స్థాయి టోర్నమెంట్



త్రోబాల్‌ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చైర్మన్‌ తదితరులు

నంద్యాల(న్యూటౌన్‌): పట్టణంలోని శ్రీగురు రాఘవేంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 28 నుంచి 7వ జిల్లా స్థాయి త్రోబాల్‌ టోర్నమెంట్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల చైర్మన్‌ దస్తగిరిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ముందుగా పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం టోర్నమెంట్‌ రోలింగ్‌ కప్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు మూడు రోజుల పాటు భోజన వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు ఈనెల 26లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, ఏపీ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ అధ్యక్షుడు ఏపీరెడ్డి, సుబ్రహ్మణ్యం, మోహన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని విజయవంతం చేద్దాం

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురంలో మంగళవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నర్సాపురంలో వైద్య శిబిరం నిర్వహించే ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు బాబు, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. వైద్యం కోసం వచ్చే పేదలకు తగిన వసతులు కల్పించాలని, చలువ పందిళ్లు, తాగునీరు, కుర్చీలు, టోకెన్లు ఇచ్చేందుకు వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తకు అవార్డు



పురస్కారాన్ని అందుకుంటున్న శాస్త్రవేత్త మంజునాథ్‌

నంద్యాల(సెంట్రల్‌): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్‌) సీనియర్‌ శాస్త్రవేత్త జీ.మంజునాథ్‌కు ప్రతిష్టాత్మక వసంత్‌రాజ్‌ డేవిడ్‌ ఫాండేషన్‌ అవార్డు దక్కినట్లు సహ సంచాలకులు ఎస్‌.సి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ...కీటక శాస్త్రంతో పాటు నానో సాంకేతికతలో మంజునాథ్‌ పరిశోధనలకు మెచ్చి అగ్రికల్చర్‌ సైంటిస్ట్‌ అవార్డు-2023 పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. చెన్నై మదనందపురంలోని సంస్థ కార్యాలయంలో ఈ అవార్డును ప్రదానం చేసినట్లు వెల్లడించారు. పరిశోధనా స్థానం తరపున మంజునాథ్‌కు అభినందనలు తెలిపారు.

నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్‌): ప్రస్తుత పరిస్థితుల్లో నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్‌ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కన్వీనర్‌ నారాయణ అధ్యక్షతన జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులు నష్టాల బారిన పడుతున్నారన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని, కల్తీలేని ఎరువులను ఇవ్వాలని కోరారు. ఈనెల 9వ తేదీన నుంచి గ్రామస్థాయి మొదలుకొని జిల్లాస్థాయి వరకు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌, జిల్లా కో కన్వీనర్‌ సోమన్న, సంజీవ్‌ తదితరులు పాల్గొన్నారు.



బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



గ్రంథాలయంలో గాంధీజీ, లాల్‌ బహదూర్‌ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



ఎస్‌టీయూ కార్యాలయంలో గాంధీజీ, లాల్‌ బహదూర్‌ శాస్త్రి చిత్రపటాలకు నివాళి



సాంబవరం సచివాలయంలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- ఘనంగా మహాత్మాగాంధీ జయంతి
- దివంగత ప్రధాని లాల్‌ బహదూర్‌ శాస్త్రికి నివాళి

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం



ద్వామా కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి





గాంధీ, లాల్‌ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్‌ మాబున్నిసా, రామచంద్రారెడ్డి, గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



క్రిష్టిపాడు సచివాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల/(అర్బన్‌)/(వ్యవసాయం)/(న్యూటౌన్‌)/(సిటీ)/నంద్యాల(సెంట్రల్‌)/గోస్పాడు: దేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుల అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ షేక్‌ మాబున్నిసా, మున్సిపల్‌ కమిషనర్‌ రవిచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌ శాస్త్రి చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు.

సోమవారం పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాలు, విద్యాసంస్థల్లో గాంధీజీ, లాల్‌బహదూర్‌ శాస్త్రీల చిత్రపటానికి పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. ఆర్డీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి ఆర్డీఓ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ ఆధ్వర్యంలో, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ శ్రీనివాసులు, శాఖా గ్రంథాలయంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, చిన్నయ్యసూరి సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్‌ రమణమూర్తిలు గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో, బీజేపీ కార్యాలయంలోజిల్లా ఉపాధ్యక్షుడు శివనరసింహగౌడ్‌ నివాళులర్పించారు.
- ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్యాంసుందర్‌లాల్‌, జనార్దన్‌రెడ్డి, చలంబాబు, మధుల ఆధ్వర్యంలో సేవ్‌ జర్నలిజం డేను నిర్వహించారు.
- ఆల్‌మేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి జిల్లా గౌరవాధ్యక్షుడు అబులైజ్‌, ప్రధాన కార్యదర్శి ఎండీ సలీమ్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక నందమూరి నగర్‌లోని సుభాష్‌ చంద్రబోస్‌, బుడగ జంగాల ఆవశ్య విద్యాలయంలో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ మాజీ సభ్యులు రాజేశ్వరమ్మ, సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వినోద్‌ అధ్యక్షతన గాంధీ, శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు.
- స్థానిక సాయిబాబానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్‌, ప్రసాద్‌ తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ సుందర్‌ గుప్త, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గంగిశెట్టి శ్రీధర్‌, పొలిటికల్‌ చైర్మన్‌ శ్యాంసుదర్‌లాల్‌ తదితరులు గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రాహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.
- శ్రీనిధి హోటల్‌ యజమాని శ్రీనిధి రఘువీర్‌ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ, రవీంద్రనాథ్‌శాస్త్రి, పార్థసారధి, ఎస్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజమ్‌ బేగ్‌, మౌలాలి, పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు తదితరులు మహత్మ గాంధీ, లాల్‌ బహదూర్‌శాస్త్రి చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.
- స్థానిక డ్వామా కార్యాలయ ఆవరణలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఇన్‌చార్జ్‌ సహ సంచాలకురాలు వెంకట రవణమ్మ, రాయలసీమ సాగునీటి సాధనా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు వై.ఎన్‌.రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నూనెపల్లె లోని జీవనియంత్రణ ప్రయోగశాలలో ప్రయోగశాల ఏవో కళ్యాణ్‌ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు.

గోస్పాడులో...

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ ఆర్థర్‌ సైమాన్‌, ఉప మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డిలు అన్నారు. గోస్పాడులోని ప్రభుత్వ కార్యాలయాలు, ఎంపీడీఓ భాస్కర్‌, ఇన్‌చార్జి తహసీల్దార్‌ విజయశేఖర్‌, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గాంధీ జయంతి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్‌ శివరామిరెడ్డి, ఉప సర్పంచి మహేష్‌ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

చాగలమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వీరభద్రుడు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోటగడ్డ వీధిలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకులు గుర్రమ్మ, మేరీ, పద్మావతి, గౌరీ తదితరులు చిన్నారులతో కలిసి గాంధీ జయంతిని నిర్వహించారు. పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ ప్రాంగణంలోని మహాత్ముడి విగ్రహనికి ఎంపీపీ బాలస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఉన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రవీంద్ర ప్రసాదు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

శిరివెళ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, మేజర్‌ గ్రామ పంచాయతీలో సర్పంచు సాలమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ అబ్దుల్‌ సలాం, మాజీ జెడ్పీటీసీ నజీర్‌ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆళ్లగడ్డ: స్థానిక గాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత భారత రెండో ప్రధానమంత్రి లాల్‌ బహాదూర్‌ శాస్త్రీల చిత్ర పటాలకు ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్‌ అధ్యక్షుడు అమీర్‌బాషా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం, గ్రామ సచివాలయంలో గాంధీజి చిత్రపటానికి ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇంజేడు సచివాలయం ఆవరణలో వున్న గాంధీ విగ్రహానికి సర్పంచ్‌ మేకల ఓబులేస్‌, ఉప సర్పంచ్‌ మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నివాళులర్పించారు.



చాగలమర్రిలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ వీరభద్రుడు



రుద్రవరం మండల పరిషత్‌ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ బాలస్వామి



శిరివెళ్ల గ్రామ పంచాయతీలో గాంధీజీ చిత్ర పటానికి పూల మాల వేసిన ప్రజా ప్రతినిధులు



ఆళ్లగడ్డలో గాంధీజీ, లాల్‌ బహుదూర్‌ శాస్త్రిల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ సచివాలయంలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ

ఉపాధి పనుల ప్రణాళిక రూపొందించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

చాగలమర్రి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 సంవత్సరానికి అవసరమైన ప్రణాళికల తయారికి గ్రామీణ అభివృద్ధిశాఖ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసిందని, ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని నంద్యాల జిల్లా డ్వా మా పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. సోమవా రం చాగలమర్రిలోని 1వ సచివాలయ ఆవరణలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పనుల ప్రణాళికలో భాగంగా సర్పంచ్‌ తొలసమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ముందుగా ఎంపీపీ వీరభద్రుడుతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి ఉపాధిహామి పనులను గుర్తించేందుకు గ్రామీణాభివృద్ధి సంస్థ ఈ నెల 2 నుంచి జిల్లాలో గ్రామాలవారీగా సర్పంచ్‌లతో గ్రామసభలను నిర్వహిస్తోందన్నారు. డిసెంబరు చివరికల్లా పనులను గుర్తించి గ్రామ, మండల, జిల్లా పరిషత్‌ల ఆమోదంతో పాటు లేబర్‌ బడ్జెట్‌ పనులన్నింటికి జిల్లా కలెక్టరు నుంచి పరిపాలన అనుమతులు తీసుకుంటే 2024-25 ప్లానింగ్‌ పూర్తవుతుందన్నారు. ఈ పనులలో భాగంగా రైతులు పొలాలకు వెళ్లటానికి రోడ్లు నిర్మించుకోవచ్చన్నారు. అలాగే మండలంలో 541 మంది గృహనిర్మాణ లబ్దిదారులు జాబ్‌ కార్డు నమోదు చేయించుకున్నారని, వారికి 90 రోజులు పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివారావు, ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు, ఏపీఓ నిర్మలా తదితరులున్నారు.

రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ

నంద్యాల టౌన్‌: మహిళలు, యువతులు రక్తహీనత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ రవికృష్ణ తెలిపారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బాలాజీ మర్చంట్‌ కళ్యాణ మండపంలో నంద్యాల మహిళా విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్‌ రామకృష్ణ మాట్లాడుతూ రక్తహీనత వల్ల శరీర వ్యాధి నిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని, తద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. యువతులు, మహిళలు ఎప్పటికప్పుడు హిమోగ్లోబిన్‌ స్థాయిలను పరీక్షించుకుంటూ ఉండాలన్నారు. నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో 25 మంది మహిళా వైద్యులు పట్టణంలోని మహిళలు, యువతులకు ఉచితంగా వైద్య సేవలు సంకల్పంతో ఈ వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ మహిళా విభాగం డాక్టర్లు మాధవి, నర్మదా, నాగమణి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

నంద్యాల టౌన్‌: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామని నేషనల్‌ మజ్దూర్‌ యూనిటీ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి తెలిపారు.అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించి న సందర్భంగా విజయోత్సవసభను సోమవారం నంద్యాలలోని ప్రథమనంది దేవస్థానం ఆవరణలోని వైఎస్సార్‌ కళ్యాణ మండపంలో నిర్వహించారు. యూనియన్‌ కార్యదర్శి శ్రీనివాసరావు,డిపో కార్యదర్శి సుబ్బారాజు, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని ఆర్టీసీ ఉద్యో గులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు నంద్యాల రీజియన్‌ నాయకులు మద్దిలేటి శివరాం, కడప జోనల్‌ సెక్రటరీ చెన్నారెడ్డి, ఇస్మాయిల్‌, నరసింహ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించాలి

నంద్యాల(అర్బన్‌): మౌలిక వసతుల కల్పనలో భాగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉందని, గ్రామస్తులు అందుకు సహకరించాలని ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి కోరారు. మేజర్‌ పంచాయతీ కానాల గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్‌ బావమ్మ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈఓఆర్‌డీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల సమయంలో కొంత మంది రహదారులను ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టారన్నారు. మరుగుకాల్వలపై నిర్మాణాలు చేపట్టడంతో కాల్వల శుభ్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రంగారావు, జమృత్‌బీ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆపస్‌ నంద్యాల జిల్లా కార్యవర్గ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్‌): ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి సుధాకర్‌రావు, శ్రీనివాసులు, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా విజయభాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి కృష్ణార్జునరెడ్డి, అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో మైనర్‌ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు వివరాలు.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మంచాల సరోజ, పెద్దన్న దంపతుల కుమార్తె ఈ నెల 1వ తేదీన ఉదయం పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఆ రోజు సాయంత్రం నుంచి కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకి లభించకపోవడంతో తల్లి సరోజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నంద్యాల(అర్బన్‌): ఈనెల 3వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న పాండురంగాపురం, 4న అయ్యలూరు-2, 5న పెద్దకొట్టాల, 6న అయ్యలూరు-1, 7న పోలూరు, 9న భీమవరం, 10న పులిమద్ది, 11న బిల్లలాపురం, 12న పుసులూరు, 13న కానాల-1, 16న మిట్నాల, 17న కానాల-2, 18న కొత్తపల్లె-1, 19న రాయమాల్పురం, 25న కొత్తపల్లె-2, 30న పాన్నాపురం-1 గ్రామాల్లో శిబిరాలు ఉంటాయన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: తేలుకాటుకు గురైన మండల పరిధిలోని మాచినేనిపల్లెకు చెందిన శ్రీనివాసులు (28) నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆదివారం కల్లానికి వెళ్లి పశువులకు గ్రాసం తీసుకు వస్తుండగా తేలు కాటు వేసింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

టైలర్స్‌ కమిటీ పట్టణ అధ్యక్షుడిగా శేఖర్‌

నంద్యాల(అర్బన్‌): టైలర్స్‌ కమిటీ నంద్యాల పట్టణ అధ్యక్షులుగా ప్రభు టైలర్స్‌ యజమాని శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కమిటీ గౌరవాధ్యక్షులు సుభాన్‌ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా మహబూబ్‌బాషా, ముంతాజ్‌బేగం, సెక్రటరీగా అబ్దుల్లా, జాయింట్‌ సెక్రటరీగా దేవకుమార్‌, ట్రెజరర్‌గా రవికుమార్‌లను ఎంపిక చేశారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా గోళ్ల జయకృష్ణ



నూతనంగా ఎంపికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించిన బార్‌ అసోసియేషన్‌ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా గోళ్ల జయకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొల్లెద్దుల రవీంద్రనాథ్‌ ఎన్నికయ్యారు. గతంలో పని చేస్తున్న విజయశేఖర్‌రెడ్డి పదవీ కాలం సెప్టెంబర్‌ 30తో ముగిసింది. సోమవారం స్థానిక బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో గతంలో పని చేసిన అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘుప్రకాష్‌లకు వీడ్కోలు పలికి, నూతన బార్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ సభ్యులు, సీనియర్‌ న్యాయవాదులు, జూనియర్‌ న్యాయవాదుల ఆధ్వర్యంలో వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ నాయకులు రామచంద్రారావు, రామచంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ప్రతాపరెడ్డి, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



కమలమ్మను సన్మానిస్తున్న సర్పంచ్‌ తొలసమ్మ

చాగలమర్రి: స్థానిక మేజర్‌ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న సి.కమలమ్మ కోవిడ్‌-19లో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలి అవార్డును అందుకుంది. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమవేశంలో కమలమ్మను సర్పంచ్‌ తొలసమ్మ, ఎంపీపీ వీరభద్రుడు, ఈఓపీఆర్‌డి సుదర్శనరావు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌ అబ్దుల్లాబాషా, వార్డు సభ్యులు ముల్లా బురాంద్దీన్‌, వి.మహబుబ్‌షరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్‌కు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్‌ రవీంద్రనాథ్‌ను ఆయన స్వగృహంలో సోమవారం సాహితీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సాహితీ సంఘాల నిర్వాహకులు శ్రీనివాస మూర్తి, డాక్టర్‌ రమణమూర్తిలు మాట్లాడుతూ గాంధీ మార్గంలో పయనిస్తూ సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ ఆదర్శంగా నిలిచిన డాక్టర్‌ రవీంద్రనాథ్‌ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లూరులో 'ఆరోగ్య సురక్ష'

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేసి 525 మందికి టోకెన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వీరందరికీ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు స్పష్టం చేశారు.